క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన చెవిటి వెంకన్నయాదవ్



సీఎంను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చెవిటి వెంకన్నయాదవ్

తుంగతుర్తి : కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ శనివారం హైదరాబాద్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు.

రూ.1.25లక్షల ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సామేల్

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన సిగ సాహితి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ విషయాన్ని బాధితురాలి కుటుంబ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన బాధితురాలి చికిత్స కోసం రూ.1.25లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సామేల్ రూ.1.25లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని బాధితురాలి కటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పానుగంటి నరసింహారెడ్డి, నాతి అశోక్, సిగ లోకేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడిగా బాలకృష్ణ

నాగారం : ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ) సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన ఆలకుంట్ల బాలకృష్ణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురహరి బుద్దారం శనివారం హైదరాబాద్‌లో ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సాయిబాబా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోరింగ్ శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మ్యాతరి సుదర్శన్, మహిళా విభాగం అధ్యక్షులు శరణ్యారెడ్డి, పధాన కార్యదర్శి నర్మదారెడ్డి, మేరావత్ లక్ష్మణ్, సత్యం, బండారి రాజు, సుధీర్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు శునకానికి అంత్యక్రియలు



శునకానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

సూర్యాపేట క్రైం: సూర్యాపేట జిల్లా పోలీసు శాఖలో డాగ్ స్క్వాడ్‌గా సేవలందించిన శునకం శనివారం మృతిచెందింది. దీంతో ఈ డాగ్‌కు జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, ఆర్ఐ నారాయణ రాజు ఆధ్వర్యంలో పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు.

శివ స్వాములకు అన్నదానం

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలో ఉన్న శివాలయంలో దీక్షలో ఉన్న శివ స్వాములకు శనివారం మేడి ఫౌండేషన్ చైర్మన్ మేడి కృష్ణ అన్న ప్రసాదం వితరణ చేశారు. అనంతరం శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు నగిరే పర్వతాలు, తండు శీను, బొడ్డు మల్సూర్, జలగం మల్లయ్య, ఉపేందర్, శ్రీశైలం, సందీప్, నరేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బంజారా ఉద్యోగులకు సెలవు ప్రకటించాలి

పెన్‌పహాడ్ : ఈ నెల 15న శ్రీసంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా బంజారా ఉద్యోగులకు సెలవు ప్రకటించాలని బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్ నాయక్ కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏట కృష్ణసందీప్, ఏఈఓలు మనోజ్, సంధ్య, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, రమేష్ నాయక్, రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అజయ్ నాయక్

చదువుకోవాలంటే నడవాల్సిందేనా..

- రవాణా సౌకర్యం లేకపోవడంతో ఆయా గ్రామాల విద్యార్థుల అవస్థలు
- అర్వపల్లి పాఠశాలకు 100మందికి పైగానే కాలినడకన రాకపోకలు
- బస్సు సౌకర్యం కల్పించాలని వేడుకోలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన ఆయా గ్రామాల విద్యార్థులు రవాణా సౌకర్యం సరిగాలేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు వెళ్లేందుకు కాలినడకన కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్తున్నారు. మండలంలోని బొల్లంపల్లి, సీతారాంపురం, కాపర్లపహాడ్, కొత్తగూడెం, చాకలిగూడెం, రామన్నగూడెం, అడివెంల, వేల్పుచెర్ల, కుంచమర్తి, ఉయ్యాలవాడ, సింగారం తండాలతో పాటు తదితర గ్రామాల నుంచి అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు విద్యార్థులు ప్రతిరోజూ వందల సంఖ్యలో వెళ్తుంటారు. అయితే ఆయా గ్రామాల నుంచి బస్సులు, ఆటోల సౌకర్యం లేకపోవడంతో చాలామంది విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు నడవాల్సి వస్తోంది. దీంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పాఠశాల సమయానికి గంట ముందే తమ గ్రామాల నుంచి బయలుదేరుతున్నారు. సాయంత్రం పాఠశాల వదిలాక తిరిగి కాలినడకనే వెళ్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రవాణా సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్ నుంచి కాలినడకన బొల్లంపల్లికి వెళ్తున్న విద్యార్థులు

ప్రతిరోజూ 10 కిలోమీటర్లు నడిచి వస్తా..



మాది బొల్లంపల్లి గ్రామం.అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో 9వ తరగతి చదువుతున్నా. గతంలో మా గ్రామానికి బస్సు సౌకర్యం ఉండేది. అయితే కొంత కాలంగా బస్సులు రావడంలేదు. దీంతో ప్రతి రోజు పాఠశాలకు కాలినడకన వెళ్లాల్సి వస్తోంది. రాను, పోను 10 కిలోమీటర్లు నడుచుకుంటూ వచ్చి చదువుకుంటున్నా.

– జి.పార్థవచారి, 9వ తరగతి

రవాణా సౌకర్యం కల్పించాలి



ప్రతిరోజు మా పాఠశాలకు కాలినడకన రావాల్సి వస్తోంది. ప్రస్తుతం నేను 8వ తరగతి చదువుతున్నా. 10 వరగత వరకు ఇంకా రెండేళ్లు నడుచుకుంటూ వచ్చి చదువుకోవాల్సిందే. బస్సులు బంద్ కావడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు రవాణా సౌకర్యం కల్పించాలి.

– జి.గణేష్, 8వతరగతి

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

- కలెక్టర్ ఎస్. వెంకట్రావ్

చివ్వెంల : వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని కలెక్టర్ ఎస్. వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వల్లభాపురంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా అందించిన దరఖాస్తుల్లో గ్యాస్ కంపెనీల పేరు తప్పుగా ఉన్న వారి వివరాలను సేకరించేందుకు చేపడుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. శనివారం సాయంత్రంలోపు 100 శాతం సర్వే పూర్తికావాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ వారం రోజుల్లో అన్ని గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా మార్చే స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎల్.లక్ష్మి, ఎంపీఓ టి.గోపి, ఆర్ఐ వెంకట్ రెడ్డి, టీఏ విజయ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రజిని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

ఉద్యోగం ఇప్పిస్తానని టోకరా

సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో ఉద్యోగం ఇప్పిస్తామని పట్టణానికి చెందిన ఓ హోటల్ యజమాని అమాయకులకు టోకరా ఇచ్చాడు. మోసపోయామని గ్రహించిన బాధితులు శనివారం హోటల్ యజమాని ఇంటి ఎదుట ఆందోళన చేశారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెన్‌పహాడ్ మండలం గూడపుకుంట తండాకు చెందిన గుగులోతు శశి దగ్గర పట్టణానికి చెందిన హోటల్ యజమాని సందీప్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.లక్ష రూపాయలు తీసుకున్నాడు. ఆరు నెలలు గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో బాధితులు సందీప్ ఇంటి ముందు ఆందోళన చేశారు. హోటల్ యజమానిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను ఆశ్రయిస్తామని తెలిపారు.

ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

తుంగతుర్తి : రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ, గిరిజన, బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఆదివారం జరిగే 5వ తరగతి ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయా గురుకులాల ప్రిన్సిపాల్స్ శ్యామలత, నీలారాణిలు తెలిపారు. శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలల పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 480 మంది, గిరిజన గురుకులంలో 384 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు తెలిపారు.

ఘంటసాల పాటల పోటీలు



పాట పాడుతున్న విద్యార్థి

భానుపురి : ఘంటసాల 50 వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని శ్రీజ్ఞాన సరస్వతి సాంస్కృతిక కళావేదిక ఆధ్వర్యంలో స్థానిక సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళావేదిక అధ్యక్ష, కార్యదర్శులు జూనియర్ ఘంటసాల బుర్రి వెంకటేశ్వర్లు, గుండా రమేష్ మాట్లాడారు. ఘంటసాల తన అద్భుత గానంతో తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.రాజా బాబు, భద్రాద్రి కోఆపరేటివ్ బ్యాంక్ మేనేజర్ కేవీఎస్ కుమార్, ఉపాధ్యాయుడు కల్లూరు నాగయ్య, సుధా బ్యాంకు ఎండీ పెద్దిరెడ్డి గణేష్, జిల్లా బాలభవన్ పర్యవేక్షకురాలు బి.రాధాకృష్ణారెడ్డి, వేదిక ఉపాధ్యక్షులు నక్క శ్రీనివాస్, దాసరి సత్యం, కార్యనిర్వాహక సహాయకులు బచ్చు పురుషోత్తం, విశ్రాంత ఉపాధ్యాయులు హమీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రెండవ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

ఆత్మకూర్ (ఎస్) : 17 సంవత్సరాలుగా నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ – వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో ఈనెల 16న సమ్మె చేస్తున్నట్లు రెండో ఏఎన్ఎంల సంఘం మండల అధ్యక్షురాలు సల్వాది నిర్మల తెలిపారు. శనివారం ఆమె మండల కేంద్రంలో మాట్లాడారు. ప్రభుత్వాలు మారుతున్నా తమకు న్యాయం జరగడం లేదన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులకు ఎన్నో వినతిపత్రాలు ఇచ్చామని, అయినా పట్టించుకున్న నాథుడే లేడని తెలిపారు. ప్రస్తుతం ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలోనైనా మా సమస్యలు పరిష్కారం కావాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఇప్పటికే సమ్మెకు సంబంధించిన నోటీసులను రాష్ట్ర హెల్త్ డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, మండల మెడికల్ అధికారికి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి వెంకటరమణ, జంపాల అన్నపూర్ణ, సంధ్య, ధనమ్మ, రేణుక, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్ అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఆ పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధి రత్నం లక్ష్మాజీ కోరారు. గ్రామానికి చెందిన దాత పెద్దిరెడ్డి వీరారెడ్డి శనివారం పాఠశాలకు డ్రమ్స్ బహూకరించారు. గ్రామ పూర్వ విద్యార్థులంతా రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం స్నేహలత, మాజీ సర్పంచ్‌లు పాలెల్లి సురేష్, జీడి వీరస్వామి, పూర్వ విద్యార్థులు బీరవోలు వాసుదేవరెడ్డి, వేములకొండ ఉప్పలయ్య, గోలి కోటిరెడ్డి, కొణతం కరుణాకర్‌రెడ్డి ఈదునూరి సంతోష్, ఎం.లింగరాజు, జి.మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేషం, బి.బాలరాజు, జీడి నాగరాజు, బి.రమేష్, ఎం.ఉజిత్, జితేందర్ రెడ్డి, బొల్లం బాలరాజు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు డ్రమ్స్ బహూకరిస్తున్న దాత వీరారెడ్డి

గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల పరిశీలన



తిమ్మాపురంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీఏఓ రామారావునాయక్

అర్వపల్లి : గ్రామాల్లో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని డీఏఓ, మండల ప్రత్యేక అధికారి రామారావునాయక్ కోరారు. తిమ్మాపురం, అర్వపల్లితోపాటు పలు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను శనివారం పరిశీలించారు. వీధులు, మురుగు కాలువలను శుభ్రం చేసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సందీప్‌కుమార్, తిమ్మాపురం పంచాయతీ కార్యదర్శి దేవులపల్లి నవీన్‌రెడ్డి, గ్రామ ప్రత్యేక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేటటౌన్ : రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ(ఎస్‌సీఈఆర్‌టీ)లో పని చేసేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్‌ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 సంవత్సరాల బోధన అనుభవంతో పాటు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్, మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో కనీసం 50శాతం మార్కులు సాధించి ఉండాలని పేర్కొన్నారు. అర్హత గల వారిని రెండు సంవత్సరాలు డిప్యూటేషన్ ప్రాతిపదికన పని చేసేందుకు హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్‌లు సంబంధిత వెబ్‌సైట్ స్కూల్ ఎడ్యుకేషన్ తెలంగాణలో ఈ నెల 11 నుంచి 17వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఎస్‌సీఈఆర్‌టీలో 13 రకాల సబ్జెక్టుల్లో 28 పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. సైకాలజీ, ఫిలాసఫీ, సోషియాలజీ, హిందీ, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఒక్కో పోస్టు, ఉర్దూకు రెండు పోస్టులు, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్, గణితం, సోషల్ స్టడీస్, తెలుగు, ఇంగ్లిష్, ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీలలో మూడు పోస్టుల చొప్పున డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను తీసుకోనున్నట్లు తెలిపారు. మార్చి 1వ తేదీ 2024 నాటికి 58 సంవత్సరాలు పూర్తికాని వారు మాత్రమే దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు యూజీసీ గ్రాంట్స్ కమిషన్ నుంచి గుర్తింపు పొందిన పోస్ట్ గ్రాడ్యుయేషన్, మాస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఎంఈడీ) పూర్తి చేసిన విద్యార్హత గల సర్టిఫికెట్లు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

సభను విజయవంతం చేయాలి

మద్దిరాల : ఈనెల 13న మాజీ సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎస్ఏ.రజాక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో మాట్లాడారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, సూరినేని నర్సింహారావు, రవీందర్‌రావు, వెంకన్న పాల్గొన్నారు.

ముల్సిపల్ బిల్ కలెక్టర్‌పై కౌన్సిలర్ భర్త దాడి



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

- మున్సిపల్ ఉద్యోగుల నిరసన, పోలీసులకు ఫిర్యాదు

సూర్యాపేట : గృహజ్యోతి పథకంలో లబ్ధిదారుల గుర్తించేందుకు వార్డుల్లో పర్యటిస్తున్న మున్సిపల్ బిల్ కలెక్టర్‌పై కౌన్సిలర్ భర్త దాడి చేసి ఆర్వోను దుర్భాషలాడాడు. సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపల్ ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లతో పాటు బిల్ కలెక్టర్ జానీమియా, ఆర్ఓ జ్ఞానేశ్వరిలు శనివారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని ఏడవ వార్డుకు వచ్చారు. ఆ సమయంలో వార్డు కౌన్సిలర్ కుంభం రేణుక, ఆమె భర్త రాజేందర్ అక్కడికి రాగా బిల్ కలెక్టర్ జానిమియా వారిని గుర్తించలేదు. దీంతో కౌన్సిలర్ భర్త రాజేందర్ కౌన్సిలర్ వస్తే మర్యాద ఇవ్వరా అంటూ జానిమియాను దుర్భాషలాడాడు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ జానిమియాను మందలించాడు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో రాజేందర్‌ను క్షమాపణ కోరేందుకు బిల్ కలెక్టర్ జానిమియా వార్డుకు వెళ్లాడు. కోపోద్రిక్తుడైన రాజేందర్ జానిమీయపై దాడి చేయడంతోపాటు ఆర్ఓ జ్ఞానేశ్వరి, సిబ్బందిని దుర్భాషలాడాడు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్న కౌన్సిలర్ భర్త రాజేందర్ కమిషనర్‌ను చంపుతానంటూ బెదిరింపులకు దిగాడు. వెంటనే అక్కడ ఉన్న సిబ్బంది, పోలీసులు కలుగజేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ విషయమై మున్సిపల్ ఆర్ ఓ, బిల్ కలెక్టర్ జానిమియాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఉద్యోగుల నిరసన...

మునిసిపల్ సిబ్బందిపై అకారణంగా దాడి చేసిన ఏడవ వార్డు కౌన్సిలర్ రేణుక భర్త కుంభ రాజేందర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం ముందుట ఆందోళన వ్యక్తం చేసి ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి రాజేందర్‌పై ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్ భర్త రాజేందర్ పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సోమవారం నుంచి తాము విధులను బహిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ సంఘం నాయకులు గౌసుద్దీన్, సయ్యద్ సమ్మి, ఉద్యోగులు ఆర్వో జ్ఞానేశ్వరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగాండ్ల శ్రీనివాస్, ఆర్ఐ శివరాంరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఎస్ఎస్ఆర్ ప్రసాద్, మున్సిపల్ ఏఈలు పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ల ఆన్‌లైన్ నమోదు



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో గ్యాస్ కనెక్షన్ల ఆన్‌లైన్ నమోదు నిర్వహిస్తున్న సిబ్బంది



నాగారం : ఫణిగిరిలో..

తుంగతుర్తి : మహాలక్ష్మి పథకానికి సబ్సిడీ గ్యాస్ సిలిండర్ కోసం చేసుకున్న దరఖాస్తుల్లో తప్పులను సవరించేందుకు శనివారం కొత్తగూడెంలో ఐసీడీఎస్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించారు. గ్యాస్ బుక్‌ల నంబర్లను, ఆధార్ నంబర్లను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీబాయి, శారద, ఆశ వర్కర్ సైదమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగారం : మహాలక్ష్మి పథకం కింద సబ్సిడీ గ్యాస్ సిలిండర్ కోసం చేసుకున్న దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సవరించేందుకు చేపట్టిన ఇంటింటి సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ) ధార శ్రీనివాస్ అన్నారు. శనివారం ఫణిగిరిలో మహాలక్ష్మి దరఖాస్తుల డేటా ఎంట్రీని పరిశీలించి మాట్లాడారు. సబ్సిడీ గ్యాస్ కనెక్షన్ కోసం వచ్చిన దరఖాస్తుల్లో లబ్ధిదారులు తప్పుగా రాసిన గ్యాస్ కంపెనీ పేరు, గ్యాస్ కన్జ్యూమర్ నంబర్, ఆధార్ నంబర్ల వివరాలను పరిశీలించి, సవరించి తిరిగి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. తప్పుల సవరణ కోసం ఇంటింటికీ వెళ్లి సరైన సమాచారం సేకరించాలన్నారు. లబ్ధిదారులకు నష్టం జరగకుండా సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి జోగునూరి జిందగిరి, అంగన్‌వాడీ టీచర్ రజిత, ఆశ వర్కర్ నాగలక్ష్మి, జీపీ సిబ్బంది వీరాచారి, మైనర్, అల్లయ్య, గోరేపాష, శ్రీను పాల్గొన్నారు.

అర్వపల్లి : ఆరు గ్యారంటీ పథకాల అమలులో భాగంగా రూ.500కే గ్యాస్ పంపిణీకై మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అధికారులు శనివారం గ్యాస్ కనెక్షన్ల ఆన్‌లైన్ నమోదు నిర్వహించారు. అర్హులైన వారంతా గ్యాస్ పథకానికి ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని ఎంపీఓ సందీప్‌కుమార్, తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు. ఆయా కార్యక్రమాల్లో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బౌద్ధక్షేత్రానికి నిధులు కేటాయించాలని వినతి

నాగారం : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఫణిగిరి బౌద్ధక్షేత్ర అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఫణిగిరికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పులిగిల్ల వీరమల్లు శనివారం హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని అసెంబ్లీ ఆవరణలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఫణిగిరి బౌద్ధ క్షేత్రాన్ని విస్మరించిందన్నారు. ఫణిగిరి బౌద్ధక్షేత్ర అభివృద్ధికి తగిన బడ్జెట్ కేటాయించి, రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ విషయంపై మంత్రి కోమటిరెడ్డి స్పందించి ఫణిగిరి బౌద్ధ క్షేత్రానికి తన నిధుల నుంచి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం తెలంగాణ అసెంబ్లీ వ్యవహారాల సలహా కమిటీ బీఏసీ మెంబర్‌గా నియమితులైన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపి, ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు వెంకటరాజయ్య, నరసింగరావు, హరి, ఉపేందర్, రాజేష్ ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మె పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు

భానుపురి : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఆర్టీసీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని స్థానిక బస్టాండ్‌లో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థ ఆర్టీసీని ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకు కార్మిక చట్టాలను సవరణ చేస్తుండడం దుర్మార్గమన్నారు. పర్యావరణ పరిరక్షణ పేరుతో ఎలక్ట్రికల్ బస్సులను ప్రవేశ పెడుతున్న కేంద్ర ప్రభుత్వం.. వాటికి ఇచ్చే సబ్సిడీని నేరుగా ఆర్టీసీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజియన్ కార్యదర్శి బత్తుల సుధాకర్, ఎంప్లాయీస్ యూనియన్ డిపో కార్యదర్శి ఎన్‌సీ సైదులు, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ డిపో కార్యదర్శి డి.రవికుమార్, ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి వి.లక్ష్మయ్య, డిపో నాయకులు వేల్పుల వెంకన్న, కార్మికులు భాస్కర్, మల్లయ్య, అంజయ్య, సైదులు, చైతన్య, బేగం, యాకమ్మ, యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి

పెన్‌పహాడ్ : ఈ నెల 16న దేశవ్యాప్తంగా జరిగే పారిశ్రామిక గ్రామీణ బంద్‌లో గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మద్దతు ఇచ్చి సమ్మెలో పాల్గొంటున్నారని గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులతో మాట్లాడారు. 2023 ఎన్నికలకు ముందు ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కనీస వేతనం నెలకు రూ. 21వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని అన్నారు. ఇప్పుడు గ్రామ పంచాయతీ కార్మికులు కోరుకున్న ప్రభుత్వమే అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం పంచాయతీ కార్మికుల న్యాయమైన కోర్కెలను తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్లు మట్టయ్య, లింగమ్మ, వెంకటమ్మ, ఎల్లమ్మ, సైదులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పని రోజులు పెంచాలి

మద్దిరాల : ఉపాధిహామీ చట్టాన్ని విస్తరించి పని రోజులను 200లకు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముక్కలపల్లి రాములు, ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని ముకుందాపురం, జి.కొత్తపల్లి గ్రామాల్లో సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల ప్రజల జీవనాదాయం పడిపోయి పేదరికం పెరిగిందన్నారు. విపరీతంగా పెరిగిన నిత్యావసరాల ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ కార్మికుల దినసరి కూలి రూ.600లకు పెంచాలని అన్నారు. ఈనెల 16న జరిగే సమ్మెలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పులుసు సత్యం, జానయ్య, రామకృష్ణారెడ్డి, కల్లెపల్లి భాస్కర్, లక్ష్మయ్య, వెంకటముత్యం, జంపాల స్వరాజ్యం, మద్దెల కోటయ్య, రామ్మూర్తి, వీరయ్య, మల్లయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం అందజేస్తున్న మట్టిపెల్లి సైదులు

వివరాలు అందజేయాలి

అర్వపల్లి : గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం అర్హులైన లబ్ధిదారులు విద్యుత్ సిబ్బందికి ఆధార్, రేషన్, సెల్ నంబర్ వివరాలు అందజేయాలని డిస్కం ఏఈ వాస శ్రీకాంత్ కోరారు. శనివారం అర్వపల్లితోపాటు వివిధ గ్రామాల్లో గృహజ్యోతి ఆన్‌లైన్ నమోదును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల తహసీల్దార్ బదిలీ

చివ్వెంల : చివ్వెంల తహసీల్దార్ ఎ.రంగారావును బదిలీ చేస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ఆయన సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లారు. అదే విధంగా ఏఆర్ఐ రామారావు మునగాలకు బదలీపై వెళ్లగా, మునగాల ఏఆర్ఐ శ్రీనివాస్ బదిలీపై చివ్వెంలకు వచ్చారు.

నిధుల కేటాయింపుపై హర్షం

నూతనకల్ : ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ప్రభుత్వం నిధులు కేటాయించడం హర్షణీయమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన హామీని నెరవేర్చడానికి కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తీగల గిరిధర్‌రెడ్డి, పన్నాల మల్లారెడ్డి, క్లెం కృష్ణారెడ్డి, బొడ్డుపల్లి అంజయ్య, దరిపెల్లి వీరన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమికి పంచనామా.. హద్దులు ఏర్పాటు

నూతనకల్ : ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు గుర్తించి పంచనామా నిర్వహించారు. మేడిగూడ గ్రామ శివారులోని 6, 9 సర్వే నంబర్లలో ఆరు ఎకరాల 16గుంటల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని చల్లా వెంకటేశ్వర్లు చేసిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు శనివారం భూమిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూమికి హద్దులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఆర్ఐ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సూర్యక్షేత్రం సందర్శన

అర్వపల్లి : తిమ్మాపురంలోని అఖండజ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రాన్ని శనివారం సూర్యాపేటకు చెందిన శ్రీవిద్యాభారతి హైస్కూల్‌తో పాటు పలు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించారు. సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. వారికి క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకుడు జనార్ధనస్వామి సూర్యక్షేత్ర విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నంద్యాల నరేందర్‌రెడ్డి, కరస్పాండెంట్ స్వాతి, ఉపాధ్యాయులు సోమయ్య, రమేష్, స్వప్న, రజిత, శిరీష, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.



తిమ్మాపురంలోని సూర్యక్షేత్రంలో పూజల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు